క్లుప్తంగా

సీఎం ముఖాముఖి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు

పెంచికల్‌పేట్: రైతు పండుగ కార్యక్రమంలో భాగంగా శనివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎల్కపల్లి రైతు వేదికలో పాల్గొన్న రైతులతో ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై చర్చించారు. సన్నవడ్ల బోనస్, రుణమాఫీపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు శ్రీవిద్య, శివ, రైతులు పాల్గొన్నారు.

వసతిగృహాల తనిఖీ

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాలను శనివారం తహసీల్దార్ శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. ఎస్సీ బాలుర వసతిగృహాన్ని డిప్యూటీ తహసీల్దార్ బక్కయ్య తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌డబ్ల్యూవో సంజీవ్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని దీక్ష

తిర్యాణి: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సర్వ శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులు శనివారం మండల కేంద్రంలోని విద్యావనరుల కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు తాము అధికారంలోకి వస్తే ఎస్ఎస్ఏ ఉద్యోగులందర్నీ రెగ్యులర్ చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు రాజ్ కుమార్, రాజేశ్, పుష్పలత, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాగజ్‌నగర్‌రూరల్: పులి దాడిలో మృతి చెందిన మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన మోర్లె లక్ష్మి కుటుంబ సభ్యులను శనివారం కాంగ్రెస్ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ పరామర్శించారు. విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లి వెంటనే నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వార్ల తిరుపతి, డైరెక్టర్ మధుసూదన్, నాయకులు నీలయ్య, తిరుపతి, సత్తయ్య, రామక్క, తదితరులు ఉన్నారు.

జిల్లాలో 30 పోలీస్ యాక్ట్

ఆసిఫాబాద్‌అర్బన్: శాంతి భద్రతల దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా నేటి నుంచి ఈ నెల 31వ తేదీ వరకు 30 పోలీస్ యాక్ట్ 1861 అమలులో ఉంటుందని ఎస్పీ డీవీ.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.సబ్ డివిజనల్ పోలీసు అధికారి లేదా పోలీసు ఉన్నతాధికారుల అనుమతి లేకుండా పబ్లిక్ సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు నిర్వహించరాదన్నారు. కత్తులు, తుపాకులు, చాకులు, కర్రలు, జెండా కర్రలు, దుడ్డుకర్రలు, పేలుడు పదార్థాలు, నేరమునకు ఉసిగొల్పే ఎలాంటి ఆయుధాలను వాడరాదని సూచించారు. లౌడ్ స్పీకర్లు, డీజేలు వంటివి కూడా ఈ సమయంలో నిషేధమన్నారు.

ఫైనల్‌కు చేరిన ఉమ్మడి జిల్లా జట్టు



హ్యాండ్‌బాల్ ఉమ్మడి ఆదిలాబాద్ జట్టు

ఆసిఫాబాద్‌రూరల్: నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ బాలికల జట్టు ఫైనల్‌కు చేరినట్లు కోచ్ అరవింద్ శనివారం తెలిపారు. మెదక్, వరంగల్, కరీంనగర్, ఖమ్మ జట్టుపై భారీ గోల్ తేడతో విజయం సాధించిందని, ఆదివారం జరిగే ఫైనల్ పోటీల్లో మహబూబ్‌నగర్ జట్టుతో ఆడనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణానికి చెందిన నాగిళ్ల రవీందర్ రచించిన ట్రాన్స్ మహిళామణులు అనే పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించనున్నట్లు చైతన్య సాహితి వేదిక నాయకులు తెలిపారు. పట్టణంలోని తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల భవనంలో మధ్యాహ్నం 2 గంటలకు పుస్తకావిష్కరణ, సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు.

నేడు కంకలమ్మ మహాజాతర

- వివిధ రాష్ట్రాల నుంచి భక్తుల రాక
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పోలీసుల భారీ బందోబస్తు



ఆలయం వద్ద ఏర్పాటు చేసిన షామియానాలు



ముస్తాబైన కంకలమ్మ ఆలయం

కౌటాల: మండల కేంద్రానికి సమీపంలోని ఎత్తయిన గుట్టపై వెలిసిన శ్రీ స్వయంభు శ్రీ కంకలమ్మ కేతేశ్వర స్వామి 20వ మహా జాతరకు ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆదివారం ఉదయం 4.30 గంటల నుంచి బ్రహ్మ ముహూర్తాన క్షేత్రాధీష్ఠాన దేవతలు కంకలమ్మదేవి-కేతేశ్వర స్వాములవారికి శతఛిద్ర మహా అభిషేకం, అలంకరణ, షోడశోపచారములు, భక్తుల సందర్శన, ఉదయం నుంచి సాయంత్రం వరకు మహా జాతర నిర్వహించనున్నారు. కుమురం భీం, మంచిర్యాల, ఆదిలాబాద్, వరంగల్, కరీంనగర్ జిల్లాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి మేదరులు తమ కులదైవాన్ని కొలిచేందుకు తరలివస్తారు. లేత బొంగులు వచ్చే ఈకాలంలో మేదరులు ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ నెల 2వరకు జాతర కొనసాగుతుంది. 3న మహాప్రసాదం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ సుల్వ కనకయ్య తెలిపారు.

ఏర్పాట్లు పూర్తి

ఆలయ కమిటీ చైర్మన్ సులువ కనకయ్య ఆధ్వర్యంలో జాతర ఏర్పాట్లు శర వేగంగా పూర్తి చేశారు. అధికసంఖ్యలో తరలిరానున్న భక్తులకు దర్శన సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్ల కోసం బారికేడ్లు, షామియాలు ఏర్పాటు చేశారు. ఏటా కార్తికమాసం చివరి ఆదివారం జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

భారీ బందోబస్తు..

జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. సిర్పూర్(టి), కాగజ్‌నగర్ ప్రాంతాల నుంచి జాతరకు వచ్చే భక్తులు తమ వాహనాలను స్థానిక మినీ స్టేడియంలో, కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు తమ వాహనాలను కౌటాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో పార్కింగ్ చేయాలి. ఇద్దరు సీఐలు, 8 మంది ఎస్సైలు, 150 మంది సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. జాతర సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా పలు దుకాణాలు ఏర్పాటు చేశారు.

జాతరకు ఇలా వెళ్లవచ్చు

కాగజ్‌నగర్ నుంచి కౌటాలకు 40 కిలో మీటర్ల దూరం ఉంటుంది. కాగజ్‌నగర్, సిర్పూర్(టి) వరకు రైల్వే సౌకర్యం ఉంటుంది. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, సిర్పూర్(టి) నుంచి కౌటాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులతో పాటు ప్రైవేట్ వాహనాలు ఉంటాయి. మహారాష్ట్ర నుంచి వచ్చే భక్తులు అహెరి నుంచి గూడెం మీదుగా కౌటాలకు చేరుకోవచ్చు. కౌటాల మండలంలో తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత నది, తాటిపల్లి వద్ద పెన్‌గంగా నదులు చూడదగిన ప్రదేశాలు.

భక్తిశ్రద్ధలతో మహా యజ్ఞం



యజ్ఞంలో పాల్గొన్న భక్తులు

కౌటాల: కంకలమ్మ ఆలయ మహా జాతరలో భాగంగా శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా వేదపండితులు సూరిపెద్ది రాధాకృష్ణ శర్మ, ఆలయ పూజారి ప్రకాశ్ ఆధ్వర్యంలో మహాయజ్ఞం చేశారు. భక్తులు కూష్మాండ బలిహారణము, కళానాస్యము నిర్వహించారు. మహా పూర్ణాహుతి, అబృథ స్నానము, మహదాశీర్వచనం తోపాటు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపీడీఓ కోట ప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు రాజేందర్‌గౌడ్, సత్తయ్య, లహాను, రాజయ్య, మణిరాం, భీమయ్య, వినాయక్‌గౌడ్ పాల్గొన్నారు.

కమిటీల ద్వారా పర్యవేక్షణ



మాట్లాడుతున్న ఎంఈవో ఆడే ప్రకాశ్

కెరమెరి: ప్రత్యేక కమిటీల ద్వారా మధ్యాహ్న భోజన పథకాన్ని పర్యవేక్షించడం జరుగుతుందని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ప్రధానోపాధ్యాయులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు కలుషిత ఆహారంతిని అనారోగ్యానికి గురవుతున్న నేపథ్యంలో విధుల్లో నిర్లక్ష్యం చేసే ఉపాధ్యాయులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించే అవకాశం ఉందన్నారు. వంటగది, పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, నాణ్యమైన భోజనం అందించాలన్నారు. జీపీఎస్ కెమెరా ద్వారా రోజుకు రెండు సార్లు ఫొటోలు దిగి గ్రూపులో షేర్ చేయాలని, రికార్డులు నమోదు చేయాలని, సమయపాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు చంద్రశేఖర్, భరత్, తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల వేట చట్టరీత్యా నేరం



శివగూడలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

కెరమెరి: వన్యప్రాణుల వేట చట్టరీత్యా నేరమని ధనోరా, కరంజివాడ సెక్షన్ అధికారులు మల్లయ్య, లాల్‌మా నాయక్ అన్నారు. శనివారం ధనోరా, శివగూడ, సుర్దాపూర్, కరంజివాడ గ్రామాల్లో అడవుల రక్షణ, పర్యావరణ ముప్పు, అటవీ జంతువుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడవుల సంరక్షణ మనందరి బాధ్యత అన్నారు. ఆర్‌వోఎఫ్‌ఆర్ పట్టాలో ఎన్ని ఎకరాలుంటే అంతే సాగుచేయాలన్నారు. కలప అక్రమంగా తరలించవద్దన్నారు. అడవుల్లో విద్యుత్ తీగలు అమర్చి వన్యప్రాణులను వేటాడితే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో అటవీ బీట్ అధికారులు స్వప్న, రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

కౌటాల: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. శనివారం కౌటాల కేజీబీవీ వసతి గృహాన్ని తనిఖీ చేశారు. రికార్డులు, స్టోర్ రూం, వంట గదులను పరిశీలించారు. రోజూ తాజా కూరగాయలు సరఫరా చేయాలని, ఐఎస్ఐ మార్క్ ఉన్న వస్తువులను వినియోగించాలని, చలికాలంలో విద్యార్థులకు ఇబ్బందులకు కలగకుండా చూడాలని, సరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఏఎన్ఎంలు అందుబాటులో ఉండి పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధవహించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎస్‌వో పవిత్ర, కార్యదర్శి సాయికృష్ణ, తదితరులు ఉన్నారు.

ఆశ్రమ పాఠశాలల తనిఖీ



వంటలను పరిశీలిస్తున్న ఎంపీడీవో

కెరమెరి: మండలంలోని జోడేఘాట్, బాబేఝరి ఆశ్రమ పాఠశాలలను శనివారం ఎంపీడీవో అంజద్ పాషా తనిఖీ చేశారు. వంటగదులు, వంట సరుకులను, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వంట గదుల్లో శుభ్రత పాటించాలని, తాజా కూరగాయలతో వంటలు చేయాలన్నారు. ఉపాధ్యాయులు తిన్న తర్వాతే విద్యార్థులకు వడ్డించాలన్నారు. సరుకుల్లో నాణ్యత పాటించాలన్నారు. నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని తయారు చేసి ఇవ్వాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన వెంట ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, హెచ్‌ఎంలు జంగు, మోతీరాం, తదితరులు ఉన్నారు.

‘రూ.2లక్షల రుణమాఫీ చేయాలి’

రెబ్బెన: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా అర్హులైన రైతులందరికీ రూ. 2లక్షల రుణమాఫీ చేయాలని మాజీ జెడ్పీటీసీ అజ్మీర బాబురావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా చాలా మంది రైతులు రెండు లక్షలకు పైగా రుణాలు తీసుకున్నారని, వారికి మాఫీ కాకపోవటంతో ఆవేదన చెందుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతులపై ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులందరికి రూ. 2లక్షల వరకు రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

బాల్య వివాహాలు అరికట్టడమే లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న ప్రభు

జైనూర్: బాల్య వివాహాలు అరికట్టడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నామని సూర్ సంస్థ మండల కోఆర్డినేటర్ ప్రభు అన్నారు. శనివారం సిర్పూర్(యు) మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థులకు అవగాహన కల్పించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్క రూ సహకరించాలన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు చేస్తున్నట్లు తమదృష్టికి వస్తే 1098 కు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో స్వప్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిసాన్‌మేళాకు తరలిన కెరమెరి రైతులు



బయలుదేరిన సేంద్రియ సాగు రైతులు

కెరమెరి: బెల్లంపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో శనివారం నిర్వహించిన కిసాన్ మేళాకు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సేంద్రియ రైతులు తరలివెళ్లారు. ఆధునిక యంత్రాలు, కలుపుతీసే యంత్రాలు, ఫిష్, పౌల్ట్రీ ఫామ్‌లను పరిశీలించారు. తక్కువ సాంద్రతతో పత్తి పంటను తీసే విధానం, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందే మార్గాలపై కేవీకే నాలుగు రాష్ట్రాల డైరెక్టర్ శేకన్ మీరా రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు కేంద్రె బాలాజీ, కుమురం న్యానేశ్వర్, తొడసం జగన్నాథ్‌రావు, మాండోరే బాజీరావు, తదితరులు పాల్గొన్నారు.

పులి బారి నుంచి రక్షించాలి

కాగజ్‌నగర్‌రూరల్: పులి బారినుంచి ప్రజలను రక్షంచాలని సీనియ ర్ సిటిజన్స్ సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ డిమాండ్ చేశారు. ప్రజలు తీవ్ర భయాందోళనలో ఉన్నారని, అటవీశాఖ అధికారుల పర్యవేక్షణ ఇంకా వేగవంతం చే యాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు నారాయణ, రమణయ్య, మూర్తి, నర్స య్య, తదితరులు పాల్గొన్నారు.

‘నువ్వు నేను గోదారి’ ఆవిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న ఆర్ఎం సోలోమన్

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోలో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మాడిశెట్టి శ్రీనివాస్ రచించిన కవితాసంపుటి ‘నువ్వు నేను గోదారి’ పుస్తకాన్ని ఆదిలాబాద్ రీజినల్ మేనేజర్ సోలోమన్, డీఎం విశ్వనాథ్ శనివారం ఆవిష్కరించారు. కార్తికమాసం వనభోజనాలు రెండో రోజులో భాగంగా కార్మికులు, సిబ్బందితో కలిసి సహపంక్తి భోజనాలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ మేనేజర్లు ప్రణీత, ప్రవీణ్, సిబ్బంది శంకరయ్య, కార్మికులు పాల్గొన్నారు.

‘స్థానికతపై అసెంబ్లీలో మాట్లాడాలి’



ఎమ్మెల్యే కోవ లక్ష్మికి వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

ఆసిఫాబాద్: ఉపాధ్యాయుల స్థానికతకు సంబంధించిన జీవో 317పై అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరుతూ ఉపాధ్యాయ జేఏసీ పిలుపు మేరకు ఉపాధ్యాయులు శనివారం జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లో స్థానికత కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం స్థానికత అంశాన్ని పట్టించుకోక పోవడం వల్ల ఉద్యోగులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. దీనిపై అసెంబ్లీలో ప్రస్తావించాలని కోరగా సానుకూలంగా స్పందించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో పృథ్వీ, అఖిల్, సంతోశ్, హరిచంద్, రాజలింగు పాల్గొన్నారు.

‘న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి’



దీక్షలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు

రెబ్బెన: తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడు సత్యనారాయణ, సీఆర్పీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట శనివారం సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు నిరసన దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, సమగ్ర శిక్షను విద్యాశాఖలో విలీనం చేసి తక్షణమే పేస్కేల్ అమలు చేయాలని, రీ ఎంగేజ్ విధానాన్ని తొలగించి ప్రభుత్వ నియామకాల్లో వెయిటేజ్ కల్పించాలని, జీవిత బీమా, రూ.10 లక్షల ఆరోగ్య బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, మండల అధ్యక్షుడు బత్తుల సదానందం మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు దేవేందర్, మహేశ్వర్, సీసీవో భాగ్యలక్ష్మి, పీటీఐలు స్వప్న, తిరుపతి, శంకర్, శేఖర్, మెసెంజర్ రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ కార్మికులకు సన్మానం



దంపతులను సన్మానిస్తున్న తోటి కార్మికులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో శనివారం ఉద్యోగ విరమణ పొందిన కార్మికుల వీడ్కోలు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఎల్దండి రాజనర్సు, పెట్టెం రాజయ్య, జాడి మల్లయ్య దంపతులను గని అధికారులతో పాటు తోటి కార్మికులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ శేష జీవితాన్ని సుఖశాంతులతో గడపాలని, రిటైర్‌మెంట్ సందర్భంగా యాజమాన్యం అందించే టర్మినల్ బెనిఫిట్స్‌ను పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు మీస చంద్రశేఖర్, దివాకర్, సహాయ కార్యదర్శి ఓదెలు, కమిటీ సభ్యులు నరేష్, కోటి, తిరుపతి, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నార్నూర్: గాదిగూడ మండలంలోని పలు గిరిజన గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో సమయపాలన పాటించని ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం ఎంఈవో మనోహర్‌కు ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలోని గాదిగూడలో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని ఆరోపించారు. ఉదయం 10:30 గంటలకు వచ్చి తిరిగి మూడు గంటలకే వెళ్లిపోతున్నారని మండిపడ్డారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు బేసిక్ విద్యను అందించాల్సిన ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కనీసం విద్యార్థులకు ఓనమాలు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి కుంరా సత్యపాల్, నాయకులు శంకర్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత



ర్యాలీ నిర్వహిస్తున్న హనుమాన్ భక్తులు

నార్నూర్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని హరి భక్త పారాయణ్ నారాయణ మహరాజ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శ్రీఆంజనేయస్వామి ఆలయం నుంచి విజయ నగర్ కాలనీ వరకు ఆధ్యాత్మిక ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయం వద్ద సామూహిక హనుమాన్ చాలీసా నిర్వహించారు. ప్రతిఒక్కరూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మాజీ సర్పంచ్ బానోత్ గజానంద్ నాయక్, ప్యాక్స్ చైర్మన్ ఆడే సురేశ్, చౌహాన్ బిక్కు, యశ్వంత్ రావు, గజానంద్, పాల్గొన్నారు.